RNI NO.TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి
దినపత్రిక

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మన ప్రజా ప్రతినిధి దినపత్రికకు, టీ.వి ఛానల్ కు జిల్లాల వారీగా, స్టాఫ్ రిపోర్టర్ మరియు మండలాలకు రిపోర్టర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను అనుభవం ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
7382966665
7382566600

ఎడిటర్ : జి.శ్రీనివాస్ సంపుటి : 2 సంచిక : 169 ఆదివారం, ఏప్రిల్ 20 2025, పేజీలు - 4 వెల : 2/-
https://epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM : TELANGANA / ANDHRAPRADESH

### తెలంగాణ యువతకు జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు..
## రేవంత్ బృందం కీలక ఒప్పందం

**జపాన్:** తెలంగాణ యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. కార్మిక ఉపాధి శిక్షణ శాఖ అధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) జపాన్‌లోని రెండు ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. జపాన్ పర్యటనలో బిజిబిజీగా ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి. అక్కడి తెలుగు కమ్యూనిటీని కలుకున్నారు. తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వ ప్రణాళికలు వివరించారు. ఎన్ఆర్ఐలు రాష్ట్ర అభివృద్ధిలో భాగం అయ్యేం దుకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. సొంత ప్రాం తంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఐటీ, ఫార్మా రంగంలో తెలంగాణ సాధించాల్సినంత ప్రగతి ఇప్పటికే సాధించిందన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. జపాన్ పర్యటనలో అక్కడి తెలుగు సమాఖ్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐటీ, ఫార్మాతో పాటు.. ఇప్పుడు పరిశ్రమలపై దృష్టి పెట్టాల్సిన అవసరం




ఉందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. రాష్ట్రంలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. మచిలీపట్నం పోర్టుతో దీన్ని లింక్ చేసి.. ఆటోమొబైల్ ఇండస్ట్రీని విస్తరించు కుందామన్నారు. టోక్యో రివర్‌ఫ్రంట్‌ను పరిశీలించామన్న సీఎం రేవంత్.. మూసీ నది ప్రక్షాళన చేద్దామంటే.. బీజేపీ, బీఆర్ఎస్ అడ్డుపడ ుతుందన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజినల్ రింగురోడ్డు, రేడియల్ రోడ్ల ప్రాజెక్టులు తెలంగాణ పురోగతికి కీలకమన్నారు. తెలంగాణకు పెట్టుబడులు రావాలి.. పరిశ్రమలు పెరగాలని ఆకాంక్షించారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఎన్ఆర్ఐలు తోడ్పాటు అందిస్తే.. ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. సొంత ప్రాంత అభివృద్ధిలో భాగం కావాలని పిలుపు నిచ్చారు సీఎం రేవంత్. టెర్న్ (టీజీయూకే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్), రాజ్ గ్రూప్ తో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు చేసుకుంది. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం ఆ రెండు సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపింది. తెలంగాణలో నైపుణ్యమున్న నిపుణులను జపాన్‌లోని అధిక డిమాండ్ ఉన్న రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

### సౌదీ అరేబియాలో
## మోదీ రెండ్రోజుల పర్యటన



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సౌదీ అరేబియా పర్యటన ఖరారైంది. ఏప్రిల్ 22, 23 తేదీల్లో ఆయన సౌదీ ఆరేబి యాలో అధికారిక పర్యటన జరుపన ున్నారు. సౌదీ క్రౌన్ ప్రిన్స్, ప్రధాన మంత్రి మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు మోదీ ఈ పర్యటనకు వెళ్తున్నారు. సౌదీలో మోదీ పర్యటించనుండటం ఇది మూ డోసారి. గతంలో 2016, 2019లో ఆదేశంలో పర్యటించారు. క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ 2023 సెప్టెంబర్‌లో ఢిల్లీలో పర్యటించి జి-20 సదస్సు, ఇండియా-సౌదీ అరేబియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ కౌన్సిల్‌కు కో-చైర్మన్‌గా వ్యవహరించారని, ఆ సందర్భంలో మోదీని తమ దేశంలో పర్యటించాల్సిందిగా కోరారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత్, సౌదీ మధ్య చిరకాల మైత్రీసంబంధాలు ఉన్నాయి. బలమైన చారిత్రక వాణిజ్య సంబంధాలు, లోతైన సామాజిక-సాంస్కృతిక సంబంధాలు కలిగి ఉన్నాయి. రాజకీయ, రక్షణ, భద్రత, పెట్టుబడులు, ఇంధనం, టెక్నాలజీ, ఆరోగ్యం, విద్య రంగాల్లోనూ బలమైన ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగిస్తున్నాయి.

### 'నాలాగా రెండు వేల మంది రీపోస్టు చేశారు..
## వాళ్లందరిపైనా చర్యలు ఉంటాయా
### : స్మితా సబర్వాల్



**హైదరాబాద్:** పోలీసుల విచారణపై ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ వివరణ ఇచ్చారు. కంచ గచ్చిబౌలి ఏఐ ఫొటో రీట్వీట్‌పై పోలీసుల విచారణకు సహకరించానని స్మితా సబర్వాల్ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. పోలీసులకు స్టేట్‌మెంట్ ఇచ్చానని స్మితా సబర్వాల్ చెప్పారు. ఆ పోస్ట్‌ను 2 వేల మంది రీపోస్ట్ చేశారన్నారు. అందరిపైనా ఇదే యాక్షన్ ఉంటుందని అనుకుంటున్నట్లు ఈ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఒకవేళ అందరినీ విచారించకుంటే తనను కావాలనే టార్గెట్ చేసినట్టు అవుతుందన్నారు స్మితా సబర్వాల్. అధికారిణి స్మితా సబర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సోషల్ మీడియా రీ-ట్వీట్ చేయడంపై వివరణ ఇవ్వాలని పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. రాక్ దగ్గర గిబ్లీ ఇమేజ్‌తో జింకలు, నెమళ్లు ఉన్న.. ఫొటోను స్మితా సబర్వాల్ రీట్వీట్ చేయడంతో పోలీసులు ఆమెకు నోటీసులు ఇచ్చారు. దీంతో విచారణ సహకరిస్తానంటూ పేర్కొన్నారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులకు అని విషయాలపై వివరణ ఇచ్చినట్లు చెప్పారు. తానలాగే రెండు వేల మంది రీపోస్టు చేశారని, వాళ్లందరిపైనా ఎలాంటి చర్య తీసుకుంటారు..? అని ప్రశ్నించారు.

### ఆడపిల్లలు కాదు.. ఆడ పులులు..
## తెలంగాణలో మొదటి శివంగి టీమ్

**నిర్మల్ జిల్లా :** నిర్మల్ జిల్లా పోలీసు వ్యవస్థలో మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేకతతో "టీం శివంగి" అనే పేరుతో ఒక మహిళా కమాండో స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలనే ధ్యేయంతో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపిఎస్ ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. ఈ టీమ్‌ను మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారికంగా ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాలలో ముందుండాలన్న ఆశయంతో నిర్మల్ ఎస్పీ తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయం అన్నారు. ఇటీవల మామడ చిట్టడవిలో తప్పిపోయిన నలుగురు మహిళలను శివంగి టీమ్ ఎంత కృషి చేసి కనుగొన్నదీ, వారి చొరవ, ధైర్యసా



హసాలు అభినందనీయమని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ విధంగా శివంగి టీమ్‌లను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని సూచించారు. శిక్షణ కష్టం అనుకోకుండా, ఆసక్తితో చేయాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ జిల్లాలో కూడా లేని విధంగా, మహిళలు పురుషులతో సమానంగా ముందుకు రావాలన్న సంకల్పంతో, ఎంపిక చేసిన మహిళలకు 45 రోజుల కఠోర శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు. ఈ శిక్షణ ద్వారా మహిళలకు ప్రత్యేక అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. దేశంలోని త్రివిధ దళాలలో ఉన్న స్పెషల్ కమాండో ఫోర్సులు, ఆర్మీ కమాండోలు, నేవీలో మార్కోస్, అలాగే ఎన్ఎస్జీ, ఎస్పీజీ వంటి అత్యుత్తమ బలగాలు, మన రాష్ట్రంలో గ్రేహౌం డ్స్ బలగాలు పనిచేస్తున్నాయి. అయితే, ఇప్పటివరకు మహిళ కమాండోలు ఏ రాష్ట్రంలో లేరని ఎస్పీ తెలిపారు. ఈ నేపథ్య ంలో వినూత్న ఆలోచనలతో 'టీం శివంగి'ని తయారు చేయడం జరిగిందని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల వెల్లడించారు. ఈ టీమ్‌కు అధునాతన ఆయుధాలపై శిక్షణ ఇచ్చారు. వాటిని వినూత్న రీతిలో వాడేలా తీర్చిదిద్దారు.



### జపాన్ తెలుగు సమాఖ్య కార్యక్రమానికి
## హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

**జపాన్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రైజింగ్ తెలంగాణ ప్రతినిధి బృందం జపాన్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి జపాన్ తెలుగు సమాఖ్య నిర్వహించిన కార్యక్ర మంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి ప్రసంగించారు. అనేక రంగాల్లో తెలంగాణ అభివృద్ధి సాధించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని అన్నారు. తెలంగాణలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను అందరం కలిసి అభివృద్ధి చేసుకోవాలని పిలుపు నిచ్చారు.


## మరో ఐదు రోజులు వానలే వానలు..

**హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. ఓ వైపు సూరీడు నెత్తిమీద సుర్రమనిపిస్తుంటే.. మరోవైపు అకాల వర్షాలతో వరుణుడు భయపెడుతున్నాడు. ఒకపూట భానుడి భగభగలు.. మరోపూట వరుణ ప్రతాపంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటు అకాల వర్షం హైదరాబాద్ మహానగరాన్ని అతలాకుతలం చేసింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మరికొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షానికి ఈదురుగాలులు తోడవ్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్ అబిడ్స్‌లో కురిసిన వర్షానికి పెను ప్రమాదం తప్పింది. ఈదురుగాలులకు భవన నిర్మాణ పనుల్లో ఉపయోగించే క్రేన్ ప్రమాదవశాత్తు కింద పడిపోయింది. దీంతో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇటు ఉప్పల్‌లోనూ పెద్ద ప్రమాదమే తప్పింది. భారీ ఫ్లెక్సీ తెగి రోడ్డుమీద ఆడుకుంటున్న పిల్లల మీదకొచ్చింది. వెంటనే వాళ్లు పరుగులు తీయడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇటు తెలంగాణలోని అదిలాబాద్,



నిర్మల్, కామారెడ్డి, నిజమాబాద్, మెదక్, సిరిసిల్లా, రంగారెడ్డి, మహబూబ్ నగర్, యాదాద్రి, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల వడగళ్ళ వానలు పడ్డాయి. సిద్దిపేట జిల్లా రాజక్కపేటలో మార్కెట్ యార్డులో ఉన్న ధాన్యం తడిసి ముద్దయ్యింది. వందల ఎకరాల్లో మామిడి పంట నేలరాలింది. నిర్మల్ జిల్లా మామిడ మండలంలో భారీ వర్షానికి పదుల సంఖ్యలో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంబాలు పంటపొలాల్లో కూలాయి. ఇటు జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో వందలాది ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. అలాగే కామారెడ్డి జిల్లా గూడెం గ్రామంలో పిడుగు పడి 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఇటు ఏపీలోనూ అకాల వర్షం దంచికొట్టింది. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలంలో ఇళ్లపైకప్పులు ఊడిపోయాయి. విద్యుత్ స్తంబాలు నేలకొరిగాయి. కరెంట్ తీగలపై చెట్టు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కడప జిల్లా వేంపల్లిలో ఉరుములతో కూడిన వర్షానికి జనం బెంబేలెత్తిపోయారు. అలాగే అల్లూరు జిల్లా పాడేరులో వర్ష బీభత్సం మామూలుగా లేదు. పెద్ద ఎత్తున పంట నష్టం జరగడంతో రైతన్నలు అల్లాడిపోతున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని పలాస, మండస, మెలియపుట్టి మండలాల్లో కురిసిన వర్షానికి పదుల సంఖ్యలో చెట్లు నెలకొరిగాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. మొత్తంగా అకాల వర్షం తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేసింది. రైతన్నలకు అపార నష్టాన్ని మిగిల్చింది. మరో ఐదు రోజులు వర్షాలు.. ఇదిలాఉంటే.. తెలుగు రాష్ట్రాల్లో మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

### మే 2న తెరుచుకోనున్న
## కేదార్‌నాథ్ ధామ్ తలుపులు



**డెహ్రాడూన్:** ఛార్ ధామ్ యాత్ర-2025 ప్రారంభమవుతోంది. ఒకదాని వెనుక మరొక ధామ్ తలు పులు తెరుచు కోనున్నాయి. ఛార్ ధామ్ యాత్ర ఏప్రిల్ 30 నుంచి ప్రారంభం కానుంది. ఈ యాత్రలో గంగోత్రి, యమునోత్రి ద్వారాలు ఏప్రిల్ 30న తెరుచుకోనున్నాయి. కేదా ర్‌నాథ్ తలుపులు మే 2, బద్రీనాథ్ తలుపులు మే 4న తెరుచుకుంటాయని శ్రీ బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రకటించింది. యాత్రికల భద్రతకు సీఎం భరోసాఛార్ ధామ్ యాత్ర రాష్ట్రానికి ఆర్థిక పరిపుష్టి కలిగించే కీలకమైన యాత్ర అని, యాత్రికుల భద్రత, సౌకర్యాల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామ్ తెలిపారు. యాత్రలో ఎలాంటి ఆటంకాలు కలుగకుండా చూసేందుకు, సురక్షితంగా యాత్రికులు తమ యాత్ర పూర్తి చేసుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.




### నిమ్స్‌లో భారీ అగ్ని ప్రమాదం..

**హైదరాబాద్, ఏప్రిల్ 19:** నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ బ్లాక్‌లో 5వ అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగసిపడటంతో ఆస్పత్రి ఆవరణ అంతా దట్టమైన పొగ కమ్మేసింది. ప్రమాదం విషయం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక సిబ్బంది ప్రాథమిక అంచనాకు వచ్చారు.

### చనిపోయిన తండ్రి గురించి చెప్తూ ఏడ్చిన చిన్నారి..
## హరీశ్ రావు కంటతడి

**సిద్దిపేట:** తన తండ్రి చనిపోయారంటూ ఓ చిన్నారి ఏడ్చుకుంటూ మాట్లాడటంతో అక్కడే వున్న మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. సిద్దిపేటలోని మెట్రో గార్డెన్స్‌లో 'భద్రంగా ఉండాలి - భవిష్యత్‌లో ఎదగాలి' పేరిట పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సదస్సుకు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహి ంచగా.. వారు తమ తల్లిదండ్రుల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఓ చిన్నారి మాట్లాడుతూ.. నా పేరు సాత్విక.. నేను ఇక్కడికి రావడానికి మా అమ్మే కారణం. నేను సెకండ్ క్లాస్‌లో ఉన్నప్పుడు మా నాన్న చనిపోయాడు. అప్పట్నుంచి మా అమ్మే నన్ను



మంచిగా చూసుకుంటుంది. కానీ, నేనే ఊరికే తిడుతుండేదాన్ని. నేను ఇప్పట్నుంచి మా మమ్మీని మంచిగా చూసుకుంటాను. మా మమ్మీకి మంచి పేరు తీసుకువస్తాను. ధన్యవాదాలు అంటూ ఆ చిన్నారి కన్నీటిప ర్యంతమైంది. ఆ చిన్నారి చెప్పిన మాటలకు హరీశ్ రావు కూడా భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. సాత్వికను దగ్గరకు చేరదీసి ఏడవద్దని చెప్పారు. తన పక్కనే కూర్చొ పెట్టుకుని ఆ చిన్నారిని హరీశ్ రావు ఓదార్చారు. అనంతరం హరీశ్ రావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అమ్మనాన్నల గౌరవాన్ని తమకు అర్థమయ్యేలా చెప్పి, వాళ్ల విలువ తెలిపేటట్టు చెప్పి.. మనందరికి కళ్లు తెరిపించిన పిల్లలను చప్పట్లతో అభినందించాలన్నారు. ఈ పిల్లల బాధలు విని ప్రతి ఒక్కరూ రియలైజ్ కావాలన్నారు.

జీవితాంతం తల్లిదండ్రులు, టీచర్లను గౌరవించాలన్నారు. అమ్మ కంటే మంచి కోరుకునేవారు ఈ భూమ్మీద ఎవరూ ఉండరని హరీశ్ రావు చెప్పారు. ఫోన్లు చూస్తూ టైమ్ వేస్ట్ చేయొద్దన్నారు.

### యాత్రికులు, టూరిస్టులకు కేంద్రం అలర్ట్..
## ఆన్‌లైన్ బుకింగ్ విషయంలో హెచ్చరిక



**హైదరాబాద్:** సమ్మర్ టైంలో అనేక మంది కూడా తీర్థయాత్రలతోపాటు అనేక ప్రాంతాలకు వెళ్లాలని చూస్తుంటారు. ఇదే సమయాన్ని అవకాశంగా తీసుకున్న కేటుగాళ్లు ఫేక్ వెబ్ సైట్లు క్రియేట్ చేసి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారు. దీనిపై సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. సమ్మర్ సీజన్ వచ్చేసింది. ఈ క్రమంలో అనేక మంది టూర్లు వెళ్లేందుకు ప్లాన్ చేస్తుంటారు. కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రి వంటి అనేక పవిత్ర ప్రాంతాలకు లక్షలాది మంది యాత్రికులు వెళ్తుంటారు. అలాగే, చాలా మంది వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి విహార యాత్రలకు కూడా సిద్ధమవుతుంటారు. ఇదే సమయాన్ని పలువురు మోసగాళ్లు అవకాశంగా తీసుకుని ఆసరాగా మార్చుకుంటున్నారు. ఫేక్ వెబ్‌సైట్లు, బోగస్ టూర్ ప్యాకేజీలతో ఆన్‌లైన్ బుకింగ్ మోసాల పేరుతో స్కాం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. తెలియని వారి నుంచి వచ్చే లింకులను క్లిక్ చేసి మోసపోవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మోసగాళ్లు ఎలాంటి స్కాంలు చేసే ఛాన్సుందిమోడర్న్ డిజైన్‌తో అద్భుతంగా కనిపించే నకిలీ వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా పేజీలు, స్పాన్సర్డ్ టూరిస్ట్ ప్రకటనలు ఇవన్నిటీ లక్ష్యం ఒకటే. చీట్ చేసి డబ్బు దోచుకోవడమే టార్గెట్.

# బారువా తీరంలో తాబేళ్ల పండుగ

## కేంద్ర మంత్రి రామ్మోహన్ చేతుల మీదుగా ప్రారంభం



**సోంపేట శ్రీకాకుళం జిల్లా :**సర్దార్ గౌతు లచ్చన స్ఫూర్తితో బారువా బీచ్‌ను ప్రత్యేక చర్యలతో మరో గోవా తరహాలో టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దుతామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలంలోని సుందర బారువ సాగర తీరంలో మే 2, 3 తేదీల నుంచి బీచ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బారువా తీరం ఒక అద్భుత వేడుకకు వేదిక కానుందని, ఇది రెండో గోవా రీతిలో తలపించేట్టుగా అన్ని రకాల హంగులతో అభివృద్ధి చేస్తామని అన్నారు. స్థానికుల సహకారంతో ప్లాస్టిక్ రహిత బీచ్‌గా తీర్చిదిద్ది, అన్ని రాష్ట్రాల ప్రజలకు గొప్ప పర్యాటక కేంద్రంగా బారువ సముద్రతీరాన్ని తీర్చిదిద్దటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు.ప్లాస్టిక్ రహితంగా చేస్తే మరింత అభివృద్ధి..స్థానిక ప్రజలు ప్లాస్టిక్ రహిత బీచ్‌గా తీర్చిదిద్దినప్పుడే ఈ ప్రాంతానికి సీఎం చంద్రబాబుని తీసుకువచ్చి అన్ని విధాలుగా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి రామ్మోహన్ అన్నారు. ఉదయం ఒలివ్ రిడ్లీ తాబేలు ఉత్సవంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టి ప్రకృతి ప్రేమికులకు, పర్యావరణ కార్యకర్తలకు ప్రత్యేక అనుభూతిని పరిచయం చేశారు.

# కర్నూలు క్యాన్సర్ ఆస్పత్రిలో అత్యాధునిక సేవలు

## మంత్రి సత్యకుమార్



**కర్నూలు :** రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా కర్నూల్ క్యాన్సర్ హాస్పిటల్ లో అత్యాధునిక సేవలు ప్రజలకు అందుబాటులో తెచ్చినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. శనివారం కర్నూలు జిజిహెచ్ లో రూ.120కోట్లతో ఏర్పాటు చేసిన క్యాన్సర్ హాస్పిటల్ ను ఆయన పరిశీలించారు. హాస్పిటల్ తో పాటు అందులో రూ.20కోట్లతో ఏర్పాటు చేసిన పరికరాలు, వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కర్నూలులో రూ.120కోట్లతో స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో అత్యధికంగా దాదాపు రెండు ఎకరాల్లో ఈ ఆసుపత్రి నిర్మించామని, ఏ ప్రభుత్వ ఆసుపత్రి లేని విధంగా కాన్సర్ ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. రూ.20కోట్ల విలువైన యంత్రాంగాలను ఇందులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.10కోట్ల మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేశామన్నారు.ప్రపంచంలో అత్యంత సేవలను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. క్లిష్టమైన సర్జరీలు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఈసంవత్సరంలో రోజూ మార్పులు తీసుకొచ్చిన సిబ్బందిని మంత్రి అభినందించారు. అధునాతనమైన టెక్నాలజీతో సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 40శాతం ప్రభుత్వ డాక్టర్ల కొరత ఉందన్నారు.

# వైసిపి చేజారిన విశాఖ మేయర్ పీఠం కూటమి ఘన విజయం



**విశాఖపట్నం:**విశాఖపట్నం వైజాగ్ మేయర్ పై కూటమి ప్రవేశ పెట్టిన అవిశ్వాసం తీర్మానం లో కూటమి విజయం సాధించింది.. మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం నోటీస్ ఇవ్వడంతో శనివారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.. జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కూటమికి చెందిన 74 మంది సభ్యులు హాజరయ్యారు.. వైసిపి సభ్యులు ఈ సమావేశాన్ని బహిష్కరించారు. కాగా అవిశ్వాస తీర్మానం గెలవాలంటే 74 మంది సభ్యులు అవసరం కాగా, ఆ బలం కూటమికి ఉండటంతో ఈ తీర్మానంలో కూటమి విజయం సాధించింది.. దీంతో ప్రస్తుతం మేయర్ హరివెంకటకుమారి పదవిని పోగొట్టుకున్నారు..అవిశ్వాస పరీక్ష ఇలా జరిగింది.అవిశ్వాస తీర్మాన పరీక్షకు విశాఖ నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 74 మంది కూటమి సభ్యులు హాజరయ్యారు. విశాఖ ఇన్‌ఛార్జి కమిషనర్, కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలోకి ఇతరులను అనుమతించలేదు. కార్పొరేటర్లు హాల్‌లోకి రాగానే ఫోన్లు ఫ్లైట్ మోడ్‌లో పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఉదయం 11 గంటలకు హెడ్ కౌంట్ అనంతరం అందరి వద్ద సంతకాలు తీసుకున్నాక ఓటింగ్ జరిగింది. విశ్వాస పరీక్షకు ఏర్పాట్లను ముందు నుంచీ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ప్రత్యేక అధికారి హరేంధిరప్రసాద్ దగ్గరుండి పర్యవేక్షించారు.

# మా వోళ్లు ఓటేయరు బీఆర్ ఎస్ సంచలన ప్రకటన

**హైదరాబాద్ :**హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ సంచలన నిర్ణయం తీసుకుంది. తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఎవరూ కూడా.. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనబోరని తెలిపింది. ఈ మేరకు పార్టీ తరఫున ఓటింగుకు ముందు రోజు విప్ జారీ చేయనున్నట్టు వివరించిం ది. దీంతో తాము ఎమ్మెల్సీ ఎన్నికల్లో తటస్థంగా ఉన్నట్టని ప్రకటించింది. ఈ మేరకు తాజాగా.. ఈ నెల 23న ఒకే ఒక్క ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీ దూరంగా ఉంది. బీజేపీ, ఎంఐఎంలు మాత్రమే పోటీ పడుతున్నాయి. ఈ విషయంపైనా బీఆర్ ఎస్ క్లారిటీ ఇచ్చింది. తమకు చాలినంత బలం లేనందుకే.. పోటీకి దూరంగా ఉన్నామని స్పష్టం చేసింది. అదేసమయంలో వేరే పార్టీకి మద్దతు ఇవ్వబోమని.. అందుకే ఓటింగుకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నామని ప్రకటిం చింది. దీంతో బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎంల సభ్యులు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొననున్నారు.ఇదిలావుంటే.. ఎంఐఎంతో పోల్చుకుంటే.. బీజేపీకి సభ్యుల కొరత ఉంది. ఎంఐఎంకు 49 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అదేవిధంగా హైదరాబాద్ ఎంపీ కూడా ఎక్స్ అఫిషియో సభ్యుడిగా పోలింగ్‌లో పాల్గొనే అవకా శం ఉంది. మొత్తంగా ఈ సీటు విషయంలో బీజేపీ చేస్తున్న పోరాటం కేవలం నామమాత్రంగానే మిగిలి పోనుంది. మరోవైపు.. ముందుగానే కాంగ్రెస్‌కు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం సహకరించిం ది. ఈ క్రమంలో ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్లు.. ఎంఐఎంకు అనుకూలంగా ఓటేసే అవకాశం ఉంది. ఫలితంగా ఎంఐఎం విజయం తధ్యమని అంటున్నారు.

# ఉక్రెయిన్ లో భారత ఫార్మా సంస్థపై క్షిపణి దాడి



**రష్యా :**షెడ్యూల్ ఖరారైతే సరిగ్గా నెల రోజుల్లో భారత ప్రధాని మోదీ రష్యాలో పర్యటించనున్నారు. ఆ దేశ విక్టరీ డే పరేడ్ కు హాజరవనున్నారు. సహజంగా మోదీ ఏ దేశానికి వెళ్లినా భారత సంతతి ప్రజలు ఆయనకు స్వాగతం పలుకుతుంటారు. కాగా, రష్యా మూడేళ్ల రెండు నెలలుగా ఉక్రెయిన్ పై యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆ దేశ మౌలిక వసతులను కూడా ధ్వంసం చేస్తోంది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ ను కూడా వదలడం లేదు.తాజాగా కీవ్ లోని భారత ఫార్మా సంస్థ గోదాంపై క్షిపణి దాడి జరిగింది. ఇది ఎవరు చేశారనేది మాత్రం బయటపడడం లేదు. ఉక్రెయిన్ ఏమో రష్యా పనే అని ఆరోపిస్తోంది. రష్యన్ రాయబార కార్యాలయం మాత్రం.. ఉక్రెయిన్ వైమానిక దళం చేసిందని చెబుతోంది.

# మాజీ మంత్రి రోజా దిష్టిబొమ్మ దగ్ధం.....

**ప్రజా ప్రతినిధి శ్రీకాళహస్తి నియోజకవర్గం...:**మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా దిష్టి బొమ్మ కి చెప్పుల మాల వేసి, దిష్టి బొమ్మ దగ్ధం చేసిన శ్రీకాళహస్తి జనసేన ఇంఛార్జి శ్రీమతి వినుత కోటామొన్న తిరుపతిలో మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ వారి అబ్బాయిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ఈరోజు శ్రీకాళహస్తి పట్టణం లోని పెళ్లి మండపం సెంటర్ లో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి వినుత కోటా రోజా దిష్టి బొమ్మ కి చెప్పుల మాల వేసి, ప్యాకేజ్ అన్నందుకు రోజా దిష్టి బొమ్మ ని చెప్పు తో కొట్టి, దిష్టి బొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. రోజా కబడ్దార్ అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజా కి నగిరి ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా బుద్ధి రాలేదని, నోటికి వచ్చినట్టు పవన్ కళ్యాణ్ గారి గురించి పదే పదే వాగడం సరికాదని హెచ్చరించారు. రోజాని ప్రజలు మరిచిపోయారని, ఎలాగైనా లైమ్ లైట్ లో ఉండడానికి ప్రయత్నిస్తూ ఇలాంటి చిల్లర మాటలు



పవన్ కళ్యాణ్ ఉద్దేశించి చేస్తుందని మండి పడ్డారు. ఎంత ప్యాకేజ్ తీసుకుని పవన్ కళ్యాణ్ గురించి చిల్లర మాటలు మాట్లాడుతున్నావని ఎద్దేవా చేశారు. ఇప్పటికీ దిష్టి బొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేస్తున్నానని, మరొక్క సారి పవన్ కళ్యాణ్ పైన నిరాధార ఆరోపణలు చేసి, చిల్లర గా మాట్లాడితే నగిరి లో రోజా ఇంటి ని ముట్టడించి అక్కడే బుద్ధి చెబుతామని



హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వీర మహిళలు, నాయకులు కావలి శివకుమార్, పేట చంద్రశేఖర్, తోట గణేష్, చిన్న తోటి నాగరాజు, చంద్ర శేఖర్ రావు, లక్ష్మి, రాజ్య లక్ష్మి , నితీష్, వెంకట రమణ యాదవ్ , లక్ష్మణ్ యాదవ్, శీను , వినోద్ , లక్ష్మణ్ , మహేష్, సురేష్, దుమ్ము, దినేష్ తదితరులు పెద్ద ఎత్తున నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# తణుకు.. పొలిటికల్ వణుకు



**గోదావరి:**ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు నియోజకవర్గంలో రాజకీయ రచ్చ చోటు చేసుకుంది. గత నాలుగు రోజులుగా ఇక్కడ పాలిటిక్స్ హీటెక్కినా.. ఇప్పుడు మాత్రం మరింత పెరిగింది. ఒకరకంగా చెప్పాలంటే కాక రేపుతోంది. అధికార టీడీపీ వర్సెస్ ప్రతిపక్ష వైసీపీ నాయకుల మధ్య దుమ్మురేపేలా మాటల యుద్ధం సాగుతోంది. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఉద్దేశించి.. టీడీపీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పరుషంగానే వ్యాఖ్యానించారు. హెచ్చరించారు. నియోజకవర్గంలో తిరగకుండా చేస్తామని వార్నింగ్ ఇచ్చారు.దీంతో ఇరు పక్షాల రాజకీయ యుద్ధం పీక్ స్టేజ్‌కు చేరింది. కొన్నాళ్ల కిందట.. కారుమూరి మీడియాతో మాట్లాడుతూ.. నియోజక వర్గంలో ప్రజలకు ఎవరూ అందుబాటులో ఉండడం లేదని అధికార పార్టీ నాయకులను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో దూషించారు. అప్పట్లోనే కారుమూరిపై టీడీపీ నాయకులు ఫైరయ్యారు. దీనికి ముందు తణుకు వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కారుమూరి రెచ్చిపోయారు. ఎందుకూ పనికిరాని ఒక వ్యక్తి ఇక్కడ గెలిచాడని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ఆయన దూషణలకు కూడా దిగారు. ఈ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఆరిమిల్లి స్పందిస్తూ.. ఘాటుగా వ్యాఖ్యానించారు.మరోవైపు.. సోషల్ మీడియాలో కారుమూరి బ్యాచ్ మరింత రచ్చ చేసింది. ఎమ్మెల్యే ఆరిమిల్లిపై తప్పుడు ప్రచారానికి దిగిందని ఆయన వర్గం నిప్పులు చెరుగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక.. మరోసారి రాధాకృష్ణ కారుమూరికి వార్నింగ్ ఇచ్చారు:ప్పుడు మాటలు మాట్లాడుతూ తప్పుడు వ్యవహారాలు చేసిన కారుమూరి నాగేశ్వరరావును నియోజకవర్గంలో ఇకపై తిరగనివ్వబోం. నోటి దురద కంట్రోల్ చేసుకోకుండా మాట్లాడుతున్నాడు. నూకలు చెల్లిస్తాం అని తీవ్రంగా విమర్శలు గుప్పించారు.దీనికి కౌంటర్‌గా వెంటనే స్పందించిన కారుమూరి.. నూకలు చెల్లిస్తాం అంటే, తనను హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.నాకు నూకలు చెల్లుతాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి చెప్పడం చూస్తుంటే.. హత్య చేయాలని చూస్తున్నాం "అని వ్యాఖ్యానించారు. ఎంపీటీసీ ఎన్నికల్లో తన ఇంటిని ముట్టడి చేయడం అందులో భాగమన్నారు. రోజుకి నాలుగు గంటలు తన గురించే ఆలోచిస్తూ ఎమ్మెల్యే ఆరమిల్లి బీపీ పెంచుకుంటున్నారని, చదువుకున్న అజ్ఞానితో తాను ఇక, మాట్లాడేది లేదని.. తనకు సంస్కారం ఉందని వ్యాఖ్యానించారు. మొత్తానికి తణుకు రాజకీయం ఒకరకంగా ఇరు పక్షాల మధ్య వణుకు పుట్టిస్తోంది.

# తెలంగాణ ఇంటర్ ఫలితాలు ఆ రోజే ప్రభుత్వ ప్రకటన

**హైదరాబాద్ :**తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇంటర్ ఫలితాల కోసం వేచి చూస్తున్న విద్యార్థుల కు బిగ్ అప్డేట్ ఇచ్చింది. ఇంటర్ ఫలితాల కోసం పెద్ద సంఖ్యలో విద్యార్థులు వేచి చూస్తున్నారు. అటు ఏపీలో ఇంటర్ ఫలితాలు గత వారం విడుదల చేసారు. పదో తరగతి ఫలితాలు 23న విడుద ల చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, ఇప్పుడు తెలంగాణలో ఇంటర్ ఫలితాల విడుదల పైన ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది.తెలంగాణలో ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఫలితాల కోసం వేచి చూస్తున్నారు. విద్యార్థుల ఉత్కంఠకు తెర దించుతూ ఈ నెల 22న ఫలితాల విడుదల చేయనున్నట్ల ప్రభుత్వం ప్రకటన చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ ఫలితాలను ప్రకటించనున్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్ ఫలితాలను ఒకేసారి విడుదల చేయనున్నారు. నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో 22న



ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఫలితాలను విడుదల చేస్తారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య సహా అధికారులు పాల్గొననున్నారు. ఇంటర్ ఫలితాలు నేరుగా ఇంటర్మీడియట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ కాగా, మార్చి 5వ తేదీ నుంచి 1532 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలను నిర్వహించారు. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు 9, 96,971 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరంతా రిజల్ట్ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. మార్చి 18 నుంచే స్పాట్ వాల్యుయేషన్ను 19 కేంద్రాల్లో ప్రారంభించిన ఇంటర్ బోర్డు అనుకున్న సమయానికే ఫలితాలు ఇచ్చేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. తొలిసారిగా రాండమ్ రీవాల్యుయేషన్ సైతం నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఇంటర్మీడియట్ బోర్డ్ జాగ్రత్తలు తీసుకుంది. దీంతో రెండు దశల్లో పరిశీలన చేసిన తర్వాతే ఫలితాల వెల్లడికి ఇంటర్ బోర్డు సిద్ధమైంది. సిజిజి ఆమోద ముద్రలతో ప్రభుత్వం అనుమతి తీసుకొని ఈనెల 22న ఫలి తాలు వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు. ఫలితాల వెల్లడి త ర్వాత రీకౌంటింగ్, రీవాల్యుయేషన్‌కు సైతం అవకాశం ఇవ్వనున్నారు.

# బట్టేబాజ్ విజయసాయిరెడ్డి.. రాజ్ కసిరెడ్డి సంచలన ఆడియో



**అమరావతి:**మద్యం స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి సంచలన ఆడియో విడుదల చేశారు. తనపై వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలు ఖండిస్తూ తగిన సమయంలో విజయసాయిరెడ్డి బాగోతం బయటపెడతానంటూ హెచ్చరించారు. మద్యం స్కాంలో తనకు పోలీసులు నోటీసులు ఇచ్చారని, ఆ నోటీసులపై న్యాయ పోరాటం చేస్తున్నానని వివరించారు. కోర్టు తీర్పు తర్వాత విచారణకు సహకరిస్తానని ఆ వీడియోలో రాజ్ కసిరెడ్డి స్పష్టం చేశారు.ఏపీ లిక్కర్ స్కాంపై సిట్ విచారణ ఓ వైపు కొనసాగుతుండగా, మరోవైపు కేసులో పాత్రధారులు, సూత్రధారులుగా చెబుతున్న వారి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ప్రధానంగా మద్యం స్కాంలో కర్త, కర్మ, క్రియా అంతా మాజీ ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డి అంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చెబుతున్న విషయం తెలిసిందే. గత నెలలో ఒకసారి ఈ విషయాన్ని చెప్పిన విజయసాయిరెడ్డి.. శుక్రవారం సిట్ విచారణ అనంతరం మళ్లీ అదే మాట చెప్పారు. మరోవైపు సిట్ విచారణకు రాకుండా పరార్ అయిన రాజ్ కసిరెడ్డిపై మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.దీంతో మద్యం స్కాంలో తన పాత్ర లేదని, విజయసాయిరెడ్డి చెప్పిన మాటలను వింటూ మీడియా ఒకే రకమైన వాదన వినిపిస్తోందని రాజ్ కసిరెడ్డి తన ఆడియో సందేశంలో ఆరోపించారు. తన వాదనను కూడా మీడియా ప్రచారం చేయాలన్నారు. మద్యం స్కాంపై తనను సాక్షిగా పేర్కొంటూ విచారణకు రమ్మని పోలీసులు నోటీసిచ్చారని చెప్పారు. అయితే తన న్యాయవాదులు సలహా మేరకు ఆ నోటీసులపై హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించానని రాజ్ కసిరెడ్డి తెలిపారు. అదేవిధంగా ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశానని వెల్లడించారు. నోటీసులు ఇచ్చిన సమయంలో తాను విచారణకు వచ్చే సమయంలో ఏమైనా రికార్డులు తేవాలా? అని కూడా సిట్ అధికారులను కోరినట్లు చెప్పారు.కానీ, వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మాత్రం పదేపదే తన పేరు చెబుతుండటం,
దాన్ని మీడియా అంతే ప్రాధాన్యమిస్తూ ప్రచారం చేయడంపై రాజ్ కసిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. "బట్టేబాజ్ విజయసాయిరెడ్డి" అంటూ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విజయసాయిరెడ్డి వ్యవహారాలన్నీ తనకు తెలుసుని, తగిన సమయంలో ఆయన బాగోతం బయటపెడతానని తేల్చిచెప్పారు.

# శబరి ఎక్స్‌ప్రెస్‌పై తాజా సమాచారం

## : అయ్యప్ప స్వాములకు సౌకర్యం

**సికింద్రాబాద్ :**వేసవి సెలవుల్లో రైల్వేకు ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుంది. వివిధ పుణ్యక్షేత్రాలు, పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించడానికి, దూర ప్రాంతాలకు రాకపోకలు సాగిం చాలనుకునే వాళ్ల రద్దీ ఎక్కువగా కనిపిస్తుంటుంది సీజన్‌లో. వాళ్లంతా కూడా రైళ్ల మీదే ఎక్కువగా ఆధారపడుతుంటారు.ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు పలు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. సికింద్రాబాద్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తోన్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు- పలు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకుని రానున్నట్లు ఇదివరకే



ప్రకటించారు.అదే సమయంలో సికింద్రాబాద్–తిరువనంతపురం మధ్య నడిచే శబరి ఎక్స్‌ప్రెస్‌పై తాజా సమాచారాన్ని వెల్లడించారు రైల్వే అధికారులు. ఈ ఎక్స్‌ప్రెస్‌కు కొత్తగా ఎల్‌హెచ్‌బీ బోగీలను అమర్చారు. ఈ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ఈ ఎక్స్‌ప్రెస్‌కు అందుబాటులోకి రావడం ఇదే తొలిసారి కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.జర్మనీకి చెందిన లింకె-హాఫ్మన్- బుష్క్ సంస్థ డిజైన్ చేసిన బోగీలు ఇవి. చెన్నై, పంజాబ్‌లోని కపుర్తలా, రాయ్‌బరేలీల్లో గల రైల్వే కోచ్ ఫ్యాక్టరీల్లో ఇవి తయారవుతాయి. ఐసీఎఫ్ రూపొందించిన బోగీలతో పోల్చుకుంటే ఈ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు మరింత సౌకర్యంగా, విలాసవంతంగా ఉంటాయి.గరిష్టంగా 160 కిలో మీటర్ల వేగానికి అనుగుణంగా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు రూపొం దాయి. యాంటీ టెలిస్కోపిక్, అడ్వాన్స్‌డ్ న్యూమాటిక్ బ్రేక్ సిస్టమ్, యాంటీ కొలిషన్ అవాయిడ్ సిస్టమ్ ఇన్- బిల్ట్‌గా ఉంటాయి.

## నేరేడుచర్ల లయన్స్ క్లబ్

# నూతన కమిటీ ఎన్నిక





**నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ):** నేరేడుచర్ల లయన్స్ క్లబ్ 2025-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారులుగా పోరెడ్డి శ్రీరామ్ రెడ్డి, చల్లా ప్రభాకర్ రెడ్డి, బట్టు మధు నేతృత్వంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షులు గా గుండ్రెడ్డి సైదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గా షేక్ యూసుఫ్, కోశాధికారిగా సరికొప్పుల నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా గుండా సత్యనారాయణ, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, కీత కనకయ్య, యారవ సురేష్ ఎన్నికయ్యారు జి ఏ టీ కన్వీనర్లుగా రాచకొండ శ్రీనివాసరావు, చిలకరాజు శ్రీను, చిత్రం విశ్వనాధ్ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో కొణతం కృష్ణారెడ్డి, క్రాంతి కుమార్, ఎడవల్లి సత్యనారాయణ రెడ్డి, ములగుండ్ల వెంకటరెడ్డి, ఉప్పల లక్ష్మారెడ్డి, రాచకొండ విజయలక్ష్మి, కోటేశ్వరరావు, శంకరాచారి,,నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ వేడుక

**సిడిపిఓ.కనకదుర్గ. సెక్టార్ సూపర్వైజర్. మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు**






**సత్తుపల్లి//మన ప్రజాప్రతినిధి న్యూస్ ఏప్రిల్, 19:**ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం సత్తుపల్లి మండలం శనివారం రామానగరం గ్రామపంచాయతీ ఆఫీస్ నందు పోషణపక్వాడ కార్యక్రమం నిర్వహించడం .సిడిపిఓ.కనకదుర్గ. అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో. భాగంగా.హ్యూమనైజేషన్.రక్తహీనత నివారిణ గురించి. మరియు బరువున్న తక్కువ ఉన్న పిల్లలు సామ్ మ డిస్టెన్సీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆహారపోషకాలు, పర్యావరణ పరిరక్షణ గురించి,బేటి బచావో- బేటి పడావో. కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అవినాష్. ఏఎన్ఎం. సునీత. అంగన్వాడీ టీచర్లు. భారతి. సర్వేశ్వరి. సౌభాగ్యం .సుజాత. ఆశ కార్యకర్త. జమలమ్మ. గ్రామ పెద్దలు. చంద్రశేఖర్. కిషోర్. గ్రామపంచాయతీ సిబ్బంది. అంగన్వాడి. తల్లులు మరియు పిల్లలు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రామీణ,పట్టణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న అయిత పరంజ్యోతి

**క్రీడాకారులకు షటిల్ బ్యాట్స్, షటిల్ నెట్, షటిల్ కాక్స్ అందజేసిన అయిత పరంజ్యోతి**



**మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 19:**మెదక్ జిల్లా, చేగుంట పట్టణ కేంద్రంలో గల ప్రముఖ సంఘ సేవకులు అయిత పరంజ్యోతి , యువకులకు షటిల్ బ్యాట్స్, నెట్, కాక్స్ అందజేసి ప్రోత్సహించినారు. అయిత పరంజ్యోతి మార్చి 27 తన పుట్టినరోజు నాడు విష్ణు ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మాకు షటిల్ బ్యాట్స్, నెట్, కాక్స్ ఇవ్వగలరని కోరగా, సరే అని మాట ఇచ్చినారు.తన మాట ప్రకారం విష్ణు అండ్ ఫ్రెండ్స్ కి షటిల్ బ్యాట్స్,నెట్ కాక్స్, అందజేసినారు. విష్ణు ఫ్రెండ్స్ అయిత పరంజ్యోతికి శాలువా కప్పి సన్మానించినారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ మేము అడిగిన వెంటనే కాదనకుండా మాకు అందజేసి నందుకు అయిత పరంజ్యోతి అన్న కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పరంజ్యోతి అందరితో కలిసి షటిల్ గేమ్ అందరితో ఆడినారు. ఈ కార్యక్రమంలో అయిత పరంజ్యోతి, టైలర్ శ్రీను, ఆవుసుల కృష్ణ, సిద్దిరాములు, మనోహర్, న్యాలపల్లి సతీష్, విష్ణు, ప్రశాంత్ కుమార్, ప్రవీణ్ కుమార్, ప్రకాష్, రాజు, సురేష్, నరేష్, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.ద

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన బీజేపీ నాయకులు



**మన ప్రజా ప్రతి నిది తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 19:**మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు చేగుంట మండలం లోని చందాయిపేట గ్రామానికి చెంది న పురుషోత్తం అనసూయకు బిజెపి నాయకుల ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ 19500 రూపాయల చెక్కు ను అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం ఆర్ఎఫ్ చెక్కు పేదలకు గొప్ప వరం అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి గ్రామ కమిటీ అధ్యక్షుడు జూకంటి శోభన్,బిజెపి మెదక్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి బోనాల జ్యోతి, సీనియర్ నాయకులు దొబ్బల మధు, ఆనందాసు ఆంజనేయులు, పేగుడ ముత్యాలు,తోటగొల్ల మధు,బుర్ర సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



**మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 19:** దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు చేగుంట మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,మండల కోఆర్డినేటర్ జనగామ మల్లారెడ్డి ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు, శనివారం కాంగ్రెస్ నాయకులు,కార్యకర్త లు తూప్రాన్ టోల్ ప్లాజా నుండి వందల సంఖ్యలో కార్లలో చేగుంట బస్టాండ్ దగ్గరికి వచ్చి అనంతరం అక్కడనుండి ర్యాలీగా గాంధీ చౌరస్తా వరకు వెళ్లారు,కార్యకర్తలు, నాయకులు,జై కాంగ్రెస్, జై చెరుకు శ్రీనివాస్ రెడ్డి, జై శ్రీనన్న, నినాదాలు చేస్తూ వెళ్లారు, గాంధీ చౌరస్తా వద్ద చెరుకు శ్రీనివాస్ రెడ్డికి క్రేన్ సాయంతో భారీ గజమాలతో సన్మానం చేశారు, గాంధీ చౌరస్తా వద్ద భారీ కేక్ కట్ చేసి అభిమానులు, నాయకులు కార్యకర్తలు ఒకరికి ఒకరు తినిపించడం జరిగింది, జన్మదిన వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాల అధ్యక్షులు,ఉపాధ్యక్షులు,మండల నాయకులు,వివిధ గ్రామాల అధ్యక్షులు, ఉపాధ్యక్షు లు కార్యకర్తలు నాయకులు,ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు,

# స్లాట్ బుకింగ్ విధానం రద్దు చేయాలి

**-చేర్యాల డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్**





**మనప్రజాప్రతినిధి దినపత్రిక,చేర్యాల:** చేర్యాల పట్టణ కేంద్రంలో ఈరోజు డాక్యుమెంట్ రైటర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ముందు నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కి వినతి పత్రం అందజేశారు ఈ సమావేశంలో డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంకెన అంజిరెడ్డి , ఉపాధ్యక్షులు తాడెం వెంకటస్వామి, కార్యదర్శి నవీన్,లు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని లేకుంటే ప్రజలు, ప్రభుత్వం, తీవ్రంగా నష్టపోతారని దీనివలన ఒకరోజులో అయిపోయే రిజిస్ట్రేషన్ రెండు మూడు రోజులు పడుతుందని రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఒకరోజు ముందుగా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని దీనివలన ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడతారని అన్నారు ఈ సిస్టం వలన ప్రభుత్వ ఖజానా కు నష్టం వాటిల్లుతుందని దీనిని ప్రభుత్వం రద్దుచేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు, ప్రభుత్వం చెప్పిన విధంగా 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్లు కావని స్లాట్ బుకింగ్ విధానం వల్ల రెండు మూడు రోజులు టైం పడుతుందని అన్నారు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా స్లాట్ బుకింగ్ విధానం వలన ఒకవేళ సర్వర్లు మొరాయిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతుందని దీనివలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు అందుకే స్లాట్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు దీనివలన ఎక్కువ మొత్తంలో రిజిస్ట్రేషన్లు అవుతాయని ప్రభుత్వ ఖజానాకు ఆదాయం పెరుగుతుందని అన్నారు ఈ విధానాన్ని రద్దు చేయకుంటే రాబోయే రోజుల్లో రిజిస్ట్రేషన్ ఆఫీసుల ముందు నిరసనలు, ధర్నాలు, నిర్వహిస్తామని హెచ్చరించారు ఇంకా ఈ కార్యక్రమం లో అంబాల శ్రీనివాస్,తాడెం కృష్ణమూర్తి, తాడెం శ్రీనివాస్, పచ్చిమడ్ల శ్రీధర్,తుమ్మ కృష్ణ,గుర్రం కిరణ్,పాల్గొన్నారు

# మున్నూరు కాపు ప్రజల పరిరక్షణకు ప్రభుత్వం ముందుకు రావాలి

**మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు తాడెం రంజిత కృష్ణమూర్తి**



**మన ప్రజాప్రతినిధి దినపత్రిక, చేర్యాల, జనగామ నియోజకవర్గం:** చేర్యాల పట్టణ కేంద్రంలో ఈరోజు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు తాడెం రంజిత కృష్ణమూర్తి నివాసానికి విచ్చేసిన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించినారు ఈ సమావేశంలో దేవయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మున్నూరు కాపు సంక్షేమానికి కట్టుబడి ఉండాలని హైదరాబాదులో మున్నూరు కాపు సంక్షేమ భవనానికి రెండు ఎకరాల స్థలం మరియు దానికి అవసరమైన నిధులు సమకూర్చాలని అలాగే ప్రతి జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల స్థలము మరియు సంక్షేమ భవనాలకు నిధులు విడుదల చేయాలని కోరారు రాష్ట్ర జనాభాలో మున్నూరు కాపులు 50 లక్షల మంది ఉన్నప్పటికీ సరైన అవకాశాలు రావడం లేదని అలాగే విద్యార్థులకు ఉద్యోగస్తులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మున్నూరు కాపు సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని అన్నారు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో 15 లక్షల మందితో హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో తాడెం రంజిత కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు అమలు చేయాలని అలాగే విద్యార్థినిలకు హాస్టల్ వసతి గృహాలు ప్రతి మండల కేంద్రంలో నిర్మించాలని అలాగే మున్నూరు కాపు మహిళల అభివృద్ధి కోసం ప్రత్యేకమైన నిధులు విడుదల చేయాలని కోరారు అలాగే కాంగ్రెస్ ప్రభుత్వంలో మున్నూరు కాపు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని ఆమె కోరారు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం చేస్తున్న పథకాలలో మున్నూరు కాపు మహిళలకు స్థానం కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు ఇంకా ఈ కార్యక్రమం లో కాశెట్టి పాండు, వెలగల దుర్గయ్య, బాలరాజు, మున్నూరు కాపు సంఘం నాయకులు, మహిళలు, పాల్గొన్నారు

# మహిళా హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలి

**-ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ**





**మనప్రజాప్రతినిధి// దినపత్రిక ,చేర్యాల:**చేర్యాల పట్టణ కేంద్రంలో ఈరోజు మహిళా చైతన్య యాత్రలో భాగంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి బస్సు యాత్ర లో భాగంగా చేర్యాలకు వచ్చారు హక్కుల సాధన కోసం మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (AIDWA) ఐద్వా "రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీపిలుపునిచ్చారు, అంబేద్కర్,పూలే జయంతులను పురస్కరించుకొని ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా హక్కుల పరిరక్షణ బస్సు యాత్ర చేపట్టారు ఈ యాత్ర ఈరోజు చేర్యాల పట్టణ కేంద్రానికి చేరుకున్న సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద. ప్రజాసంఘాల నాయకులు ఆ బస్సు యాత్ర కు ఘనంగా స్వాగతం పలికారు, యాత్ర బృందం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పించడం జరిగింది అనంతరం ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ, రాజ్యాంగంలో స్త్రీ,పురుషులకు సమాన హక్కులు కల్పించిన ప్పటికీ మహిళలపై అసమానత్వం కొనసాగుతుందన్నారు, విద్య వైద్యం, ఉపాధి కల్పనలో ఇంకా స్త్రీలు వెనుకబడి ఉన్నారని ఆమె అన్నారు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ "భేటీ భచావో" "భేటీ పడావో" అని అంటూనే మహిళలపై జరుగుతున్న దాడులు హింస ,లైంగిక దాడులు, హత్యలు, అత్యాచారాలు, కుల దురహంకార హత్యలు తదితర వాటి గురించి ఏమాత్రం మాట్లాడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం స్త్రీ పురుషులు కుల,మతాల కతీతంగా సాగించిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వం ఉన్న తెలంగాణ గడ్డపై నేడు కుల దురహ%శీ%కార హత్యలు జరగడం దారుణం అని అన్నారు, మహిళా హక్కుల పరిరక్షణ తో పాటు దేశ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కోసం ఐద్వా రాష్ట్ర కమిటీ చేపట్టిన యాత్రను జయప్రదం చేయాలని కోరారు,ఈ కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షురాలు అరుణ జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే అశాలత, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సాయి లీల సిద్దిపేట జిల్లా కార్యదర్శి అత్తిని శారద, జిల్లా కమిటి సభ్యురాలు బద్దిపడగ పరమేశ్వరి, ఇప్పకాయల శోభ, ప్రజా సంఘాల నాయకులు నక్కల యాదవ రెడ్డి,శెట్టిపల్లీ సత్తిరెడ్డి,కొంగరి వెంకట్ మావో, బండకింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్ ,రాళ్లబండి నాగరాజ,తదితరులు పాల్గొన్నారు

# మల్లీశ్వరిని ఆత్మహత్యకు ప్రేరేపించిన జనారెడ్డి పై హత్యా కేసు నమోదు చేయాలి

**బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు డిమాండ్**




**నేరేడుచర్ల (మన ప్రజాప్రతినిధి దినపత్రిక ):** నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్క ముంతలపాడు గ్రామానికి చెందిన ధర్మారపు మల్లీశ్వరిని ప్రేమ పేరుతో మోసగించి ఆమె ఆత్మహత్య కు కారణమైన కుక్కల జానారెడ్డి పై హత్యకేసు నమోదు చేయాల ని కోరారు.సూర్యాపేట జిల్లానేరేడుచర్లలోని వివిధ ప్రజాసంఘాల వారు మల్లీశ్వరి చిత్రపటానికి కొవ్వొత్తులతో ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు మాట్లాడుతూ..... కుక్కల జానారెడ్డిని కాపాడేందుకు అనేక మంది రాజకీయ వ్యక్తులు ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయని, మల్లీశ్వరి చనిపోయి నాలుగు రోజులైనా ఇంతవరకు కాంగ్రెస్ పార్టీ నాయకులైన స్థానిక ఎంపీ కుందూర్ రఘువీర్ రెడ్డి గాని స్థానిక ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి గాని బిఆర్ఎస్ పార్టీ నాయకులైన స్థానిక ఎమ్మెల్సీ ఎం సి కోటిరెడ్డి గాని ఎందుకు వారిని.... వారి కుటుంబాన్ని పరామర్శించలేదని వారు ప్రశ్నించారు. కేవలం బీసీ ఎస్సీ ఎస్టీ సంఘాలోని నాయకులు మాత్రమే పరామర్శకు వెళుతున్నారని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నోముల భగత్ లాంటి వారు మాత్రమే పరామర్శకు వెళ్లి ఉన్నారని ఇందుకు అగ్రవర్ణాల పెద్దలు ఏమి సమాధానం చెబుతారని వారు ప్రశ్నించారు కుక్కల జానారెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నిర్భయ కేసు నమోదు చేయాలని మల్లీశ్వరి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని భవిష్యత్తులో ఇలాంటి కేసులు కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్ కుమార్, పెరుమాళ్ళ సతీష్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు జిలకర రామస్వామి తక్కెళ్ళ నాగార్జున డాల్ఫిన్ శ్రీనివాస్ జింకల భాస్కర్ పాల్గొన్నారు

# వ్యక్తిత్వ వికాసం తోటే విద్యార్థుల్లో సంపూర్ణ అభివృద్ధి




**నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ) :**శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ దేవరశెట్టి సత్యనారాయణ విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందాలి అన్న ఉద్దేశంతో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ ట్రైన ర్ వీరవెల్లి శ్రీలత ని స్కూలుకి ఇన్వైట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యాలయాల్లో కూడా పిల్లల మార్పు కోసం డిజిటల్ క్లాసెస్ ని కండక్ట్ చేస్తున్నారు, టెక్నాలజీని ఎంతగానో పిల్లల ముందుకు తీసుకువస్తున్నారు, చదువుకునే విద్యను కష్టంతో కాదు ఇష్టంతో నేర్చుకోవాలని చెప్పారు విద్య యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేశారు, విద్య ఒక్కటి ఉంటే అన్ని రంగాల్లో రాణించవచ్చు అని చెప్పారు, తల్లిదండ్రుల్ని గురువుల్ని ఎల్లవేళలా గౌరవించాలని మోరల్ ఎథిక్స్, మెమొరీ టెక్నిక్స్, వేసవి సెలవులు సమయాన్ని వృధా చేసుకోకుండా స్టడీ స్కిల్స్ ని పెంపొందించుకోవాలని, సమయాన్ని ఎప్పుడు వృథా చేయవద్దని,విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలు సాధించాలి అంటే ప్రణాళిక బద్ధంగా చదువుకున్నప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది అని దాని నిదర్శనంగా అబ్దుల్ కలాం గారి మరియు సీతల్ దేవి యొక్క జీవిత చరిత్రలు ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళితే సమాజానికి దేశానికి ఉపయోగపడే విధంగా మంచి విద్యార్థులుగా తయారవుతారని ఈ సందర్భంగా చెప్పటం జరిగింది. ఇంపాక్ట్ కోట్రైనర్ మాసెట్టి విశాల విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు పాటలు ఆరోగ్యము తినే ఆహారము ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పిల్లలకు వివరించారు. శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ దేవరశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఇంపాక్ట్ లో ట్రైనర్స్ వ్యక్తిత్వ వికాసం గురించి విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడం ఎంతో బాగుందని కొనియాడారు.ప్రిన్సిపాల్ దేవరశెట్టి సత్యనారాయణ డీన్ విజయ్ కృష్ణ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# ధాన్య కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి..




**మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:** అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి కూసుమంచి మండలం పాలేరు ధాన్య కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చెందిన అదనపు కలెక్టర్ జిల్లాలో ధాన్య కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ కూసుమంచి మండలం లోని పాలేరులో ఏర్పాటుచేసిన ధాన్య కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలు, ట్యాబ్ ఎంట్రీ, రైతులకు డబ్బు చెల్లింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం వచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం ట్యాబ్ ఎంట్రీ చేసి, సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు.కొనుగోలు కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆటోమేటిక్ ప్యాడీ క్లినర్ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పనితీరును అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాల కల్పన చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్ తనిఖీల సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, అధికారులు తదితరులు ఉన్నారు.ం

# నర్సింగ్ మండలం లో ఘనంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు



**మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా నర్సింగ్/ చేగుంట,ఏప్రిల్ 19:** దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు మండల ఉపాధ్యక్షులు వినోద్,మండల కోఆర్డినేటర్ జుకంటి రాజగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తూప్రాన్ టోల్ ప్లాజా నుండి నర్సింగ్ చారి హాస్పిటల్ వరకు వందల సంఖ్యలో కార్లలో వచ్చి అనంతరం అక్కడనుండి ర్యాలీగా చౌరస్తా వరకు వెళ్లారు,కార్యకర్తలు, నాయకులు, జై కాంగ్రెస్, జై చెరుకు శ్రీనివాస్ రెడ్డి, జై శ్రీనన్న, నినాదాలు చేస్తూ వెళ్లారు, చౌరస్తా వద్ద చెరుకు శ్రీనివాస్ రెడ్డికి క్రేన్ సాయంతో భారీ గజమాలతో సన్మానం చేశారు, చౌరస్తా వద్ద భారీ కేక్ కట్ చేసి అభిమానులు, నాయకులు కార్యకర్తలు ఒకరికి ఒకరు కేకు తినిపించడం జరిగింది, జన్మదిన వేడుకల్లో మాజీ టెలికామ్ బోర్డు మెంబెర్ అంచురి రాజేష్, , పట్టణ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి,ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు గోవర్ధన్, మండల బిసి సెల్ అధ్యక్షులు రాజేశ్వర్ గౌడ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శంకర్ నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు యాదగిరి యాదవ్, సంపత్ రెడ్డి, బాచి, బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మండల నాయకులు, వివిధ గ్రామాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కార్యకర్తలు నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు,

# కుమ్మరుల కష్టాలు తీరేది ఎప్పుడు మహాప్రభు అంటున్న పొన్నా రవికుమార్



**ప్రజా ప్రతినిధి తిరుపతి జిల్లా.:**బంక మట్టి తీసుకు రావడం .పెళ్ళలు, రాళ్లు లేకుండా చూడటం మట్టి వుడ్డ పోసి నీటితో నాన బెట్టడం మనకు కావలసిన విధంగా మట్టిని తయారుచేసు కోవడం సారె లేదా చేతితో మట్టి పాత్రలు వగైరాలు చేసుకోవడం మట్టి పాత్రలు ఆర బెట్టుకోవడం. వాన వస్తే తడవకుండా ఎత్తి పెట్టి కోవడం ఆరిన కుండలు వగైరాలు కాల్చడానికి కట్టెలు, దుగ్గ సమకూర్చడం సరైన మంచి రోజు, వాన రాని రోజు చూసుకొని వామి ని సమకూర్చడం.వామి లో కుండలు అన్నీ కాలడానికి కట్టెలను అమర్చడం మట్టి పాత్రలు సరైన పద్ధతిగా అమర్చడం పైన బంక మట్టి ని పుర్రు పుర్రు గా చేసుకొని పూయడం దైవ సమానమైన వామికి తియ్యని పదార్ధాలతో పూజ చెయ్యడం పూజ చేసి అందరికి ప్రసాదం పంచిపెట్టడం .ఇక మంట ఎక్కువ రావడానికి చాటతో విసురు తుంటే ఆ పొగకు కండ్లు మైమర్లు రావడం అంతలో పైన మేఘాలు ముసిరితే బిక్కు బిక్కు మని దైవాని తలుచుకోవడం. పూజ చేసిన ప్రతిఫలం దేవుడు కరునించడం మొత్తానికి వామి కాలిన తరువాత మెల్ల మెల్లగా ఒక్కొక్కటే తీసి వేరు చేసి పెట్టడం తీసిన వాటిని అమ్మడానికి వారపు సంతలో గాని కుదురుతో మోపుగా చేసి కాలినడకన నెత్తి మీద పెట్టుకొని అమ్మడం గాని ఈ జెనరేషన్‌లో ఆటో, బైక్ లు అమ్మడం గాని అన్నీ అయినా తరువాత ఇక ఉంటది అమ్మేటప్పుడు ఒక మట్టి పాత్ర ధర చెబితే సగం ధరకు ఇస్తావా అని బేరమాడేవాళ్ళును చూస్తే మనసు అంగీకరించక పోవడం.అంతలో కుటుంబ పరిస్థితి, మళ్ళీ మోసుకు పోవడం కష్టం కనుక మనసు ఒప్పుకోక పోయిన చివరిన మంచి మనస్సుతో ఇచ్చేయడం. కొందరు మహానుభావులు మన కష్టం విలువ తెలిసిన గ్రామం వాళ్ళు వారి ఇంట్లో వున్న వాళ్ళు పండించిన మిరప, వేరుశెనగ, ధాన్యం, పప్పులు వగైరాలు మట్టి పాత్రలు తీసుకొన్నందుకు బదులుగా ఇవ్వడం సంతలో అమ్మినపుడు పిల్లలు అయ్ మాకు బొరుగులు తెస్తారే అని గంతులెయ్యడం సంతలో ఒక్కొక్కసారి తక్కువ అమ్మడం దిగాలుతో ఇంటికి రావడం.ఇన్ని కష్టాలు అధికమించి కుటుంబాన్ని చక్కదిద్దుకోవడం ఇది మన కుమ్మర్ల కష్టసుఖాలు అని కుమ్మరుల అభివృద్ధి సంక్షేమ సమితి తరపున రాష్ట్ర అధ్యక్షులు పొన్నా రవి కుమార్ తమ ఆవేదనను తెలియజేశారు.

# చిన్నారికి అండగా తన్నీరు

**-తన్నీరు కళ్ళలో కన్నీరు**
**-చిన్నారిని ఓదారుస్తూ కంటతడపెట్టిన హరీష్ రావు**



**మనప్రజాప్రతినిధి//సిద్దిపేట జిల్లా:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆధ్వర్యంలో సిద్దిపేటలో విద్యార్థుల కోసం భద్రంగా ఉండాలి భవిష్యత్తులో ఎదగాలన్న అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఓ చిన్నారి తన ఆవేదనను చెబుతూ అందరికీ కంటతట పెట్టించింది. తండ్రి చనిపోయాడు తన బాధ్యతలన్నీ తల్లి ఎంతో కష్టపడి చూసుకుంటుందని చిన్నారి సాత్విక అనే విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీరు పెట్టుకుంది.దీంతో అక్కడే ఉన్న హరీష్ రావు చిన్నారిని అక్కున చేర్చుకుని,ఆ అమ్మాయి ని ఓదార్చడంతోపాటు కంటతడి పెట్టుకున్నారు. ఆవేదనకు లోను కావద్దని తాను అన్ని విధాల అండగా ఉంటానని చిన్నారి సాత్వికకు హరీష్ రావు భరోసానిచ్చారు. కార్యక్రమం పూర్తయ్యేం తవరకు ఆ చిన్నారిని పక్కనే కూర్చోపెట్టుకొని ఎంతో మనోధైర్యాన్ని కల్పించారు. విద్యార్థులకు తల్లిదండ్రుల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు చెప్పిన మాట వినాలని కోరారు.

# వజ్రోత్సవ సభ కోసం చేర్యాల ఏడో వార్డులో ముమ్మర ప్రచారం

**-వరంగల్లో జరిగే బిఆర్ఎస్ వజ్రోత్సవ సభ కోసం చేర్యాల ఏడో వార్డులో ముమ్మర ప్రచారం**
**-అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని ఏడవ వార్డ్ ఇంచార్జ్ తాడెం రంజిత కృష్ణమూర్తి ప్రచారం**




**మన ప్రజా ప్రతినిధి దినపత్రిక, చేర్యాల, జనగామ నియోజకవర్గం:** జనగామ నియోజకవర్గ శాసనసభ్యులు బీ ఆర్ ఎస్ పార్టీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి . డాక్టర్ పల్లారాజేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం చేర్యాల పట్టణంలో ఏడవ వ వార్డ్ ఇంచార్జ్ %ం% మహిళా అధ్యక్షురాలు తాడెం రంజిత కృష్ణమూర్తి రజతోత్సవ సభను జయప్రదం చేయుట కొరకు వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో ఈనెల27 న నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రతి ఇంటి నుండి ఇద్దర లేదా ఒకరు వచ్చి విజయవంతం చేయాలని వార్డులో వాల్ పోస్టర్లు ఇంటింటికి తిరిగి గోడలకు అతికించడం జరిగినది వార్డులో మహిళలు అత్యధికంగా పది సంవత్సరాల అభివృద్ధి మన కళ్ళముందే ఉందని సభను ముందుండి విజయ వంతం చేస్తామని మహిళలు ముందుకు వచ్చారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వరరావు, జిల్లా రైతు బంధు నాయకులు అంకు గారి శ్రీధర్ రెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శి గోనెహరి,కార్యదర్శి బురగోని తిరుపతిగౌడ్, పాల్గొన్నారు

# భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి భూ భారతి చట్టం...




**మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:**జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డా. శ్రీజ హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు నూతన భూ భారతి చట్టంలో చక్కని అవకాశం కూసుమంచి, తిరుమలాయపాలెం మండల కేంద్రాల్లో తెలంగాణ భూ భారతి చట్టం-2025 పై అవగాహన సదస్సును నిర్వహించిన ఇంచార్జ్ కలెక్టర్ ఖమ్మం/కూసుమంచి, తిరుమలాయపాలెం భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు.శనివారం ఇంచార్జ్ కలెక్టర్, కూసుమంచి మండలం పాలేరులోని పి.వి.ఆర్. కళ్యాణ మండపం, తిరుమలాయపాలెం మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి చట్టంపై అవగాహన సదస్సును ఖమ్మం ఆర్డీవో నరసింహారావుతో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి చట్ట అమలుకు పైలెట్ ప్రాజెక్టు క్రింద రాష్ట్రంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేయడం హర్షనీయమని అన్నారు. భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం పై జిల్లాలో అవగాహన సదస్సుల ను నిర్వహించుకుంటున్నట్లు అన్నారు. గత ధరణిలో లేని అనేక వెసులుబాటులను నూతన చట్టం భూ భారతిలో పొందుపరచడం జరిగిందని తెలిపారు.భూభారతి చట్టంలోని ముఖ్యమైన అంశాలను ఇంచార్జ్ కలెక్టర్ వివరిస్తూ, భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, సాదా బైనామాలకు సంబంధించిన వివరాలు అన్నింటిని రైతులు ఇతర రైతులతో పంచుకోవాలని, చట్టంపై అందరికీ పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. భూభారతి చట్టంలోని అంశాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఫిర్యాదులను సమర్పించి పరిష్కరించుకోవచ్చని, ఒకవేళ రైతులకు ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే ఉచిత న్యాయ సహాయాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. భూ భారతి చట్టం, భూములకు సంబంధించి అవినీతిని అరికట్టి, రెవెన్యూ శాఖను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు పాత పోర్టల్ ధరణి నుండి క్రొత్త పోర్టల్ భూ భారతికి షిఫ్ట్ అవుతున్నందున లోటుపాట్లు, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్ళడానికి పైలట్ స్టడీకి రాష్ట్రంలో 4 మండలాలు ప్రభుత్వం ఎంపిక చేసిందని,అందులో మన జిల్లాలో నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేశారని, ఇది రాష్ట్రం తరపున పెద్ద బాధ్యతని, అందరం కలిసి నెరవేర్చాలని అన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో చట్టంపై అవగాహన కార్యక్రమాలకు కార్యాచరణ చేశామన్నారు.కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నరసింహరావు భూ భారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలపై రైతులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. గతంలో ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని, ఇప్పుడు రికార్డుల నిర్వహణ ఉంటుందని, భూమి కలిగిన ప్రతి రైతుకు ఆధార్ కార్డు లాగే భూధార్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పీల్ వ్యవస్థ లేదని, ఇప్పుడు రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని, ప్రతి అంశానికి సంబంధించి భూ భారతి పోర్టల్ ఉంటుందని, ఎవరైనా వారి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు. భూమి హక్కుల రికార్డు నిర్వహణతో ఎవరు భూమికి యజమానో స్పష్టత వస్తుందన్నారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉండి రికార్డులో లేని వారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూమి హక్కుల రికార్డులు భూ భారతి పోర్టల్‌లో అందరికి అందుబాటులో వుంటాయన్నారు ఎవరైనా భూ హక్కుల రికార్డు సర్టిఫైడ్ కాపీ కావాలంటే భూ భారతిలో ఉన్న ఫారంలో పది రూపాయల ఫీజు చెల్లించి దరఖాస్తు చేయాలని, తహసీల్దార్ సర్టిఫైడ్ కాపీ జారీచేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేశ్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, కూసుమంచి, తిరుమలాయపాలెం ఇంచార్జ్ తహసీల్దార్లు కరుణశ్రీ, సుధీర్ ఎంపిడివోలు వేణుగోపాల్ రెడ్డి, సిలార్ సాహెబ్, మండల వ్యవసాయ అధికారిణి రాధ, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో ఘనంగా స్వర్ణ ఆంధ్ర... స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం...





**ప్రజా ప్రతినిధి తిరుపతి జిల్లా:**కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గారు, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే , ఎస్పీ ఘన స్వాగతం పలికిన అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర సహకారం కావాలంటే ప్రజలు ప్రజా ప్రతినిధులు అధికారులు స్వచ్ఛంద సంస్థలు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరిన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ దివస్, ఈ వేస్ట్ పై రెవెన్యూ, పంచాయితీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఎమ్మెల్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర గూర్చి వివరించి వారిని ఇప్పటినుంచి కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యే విధంగా తీర్చిదిద్దాలన్నారు.తడి పొడి చెత్తలు మరియు పాడైన ఎలక్ట్రానిక్స్ పరికరాలను చెత్త సేకరణ వాహనంలో వేసిన ఎమ్మెల్యే గారు, ఎస్పీ నేటి పిల్లలే రేపటి భావిభారత పౌరులు ... మీరు ఆదర్శంగా ఉండి మిగతా వారిని జాగృతం చేయండి గత వైసిపి ప్రభుత్వం పాలనలో మురికి ఆంధ్రప్రదేశ్ గా తీర్చి దిద్దారు ... కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దుతున్నారు.గౌరవ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు విజన్ 2047 పెట్టి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారు.ఇల్లు శుభ్రపరచుకోవడమే కాదు... ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి: ఎస్పీ హర్షవర్ధన్ రాజు ముఖ్యమంత్రి గారి కళ సాకారంలో మనం భాగస్వామ్యం అవుదాం : ఎమ్మెల్యే చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛత హీ సేవ 2025 కార్యక్రమంలో పాల్గొని ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని , ఎస్పీ హర్షవర్ధన్ రాజుప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులతో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర పై అవగాహన ర్యాలీ నిర్వహించిన ఎమ్మెల్యే గడియారం మాను వద్ద మానవహారం నిర్వహించి ప్లాస్టిక్ వ్యర్థాలపై కలిగే అనర్థాలను తెలియజేశారు.రాముల వారి గుడి వద్ద నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు స్వర్ణ- ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పై ర్యాలీని నిర్వహించారు

# విశ్వవ్యాప్తంగా అమర్నాథ్ సేవలు

**విశ్వవ్యాప్తంగా అమర్నాథ్ అన్నదాన సేవా సమితి సేవలు**
**-అమర్నాథ్ అన్నదాన సేవా సమితి నూతన కార్యవర్గం ఏర్పాటు**
**-మర్యాద పూర్వకముగ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుని కలిసిన నూతన కార్యవర్గం**
**-అధ్యక్షులుగా కాచం కాశినాథ్, ప్రధాన కార్యదర్శిగా గంజి రాములు, కోశాధికారిగా గోపిశెట్టి శరభయ్య, పీ ఆర్ ఓ గా డా. మాంకాల నవీన్ కుమార్**



**మనప్రజాప్రతినిధి//సిద్దిపేట జిల్లా:**అమర్నాథ్ అన్నదాన సేవా సమితి సేవలు విశ్వవ్యాప్తం అవుతున్నాయి అని అందులో నేను సభ్యుడిగా ఉండటం నా అదృష్టం అని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. అమర్నాథ్ అన్నదాన సేవాసమితి నూతన కార్యవర్గం ఏర్పాటులో భాగంగా నూతన కార్యవర్గం మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ సమితి ద్వారా అమర్నాథ్ యాత్రికులకు చేసే సేవలు వెల కట్టలేనివని, మంచుకొండల్లో మన తెలుగువారి బోజనము స్వీకరించడం అమృతం వంటిదని, దీని వల్ల సిద్దిపేట పట్టణానికి ఎంతో పేరు సమకూరిందని,ఇందులో ఉన్న సభ్యుల కృషి మరువలేనిదన్నారు. గతములో చేసిన సేవలకు తమ వంతు సహాయం ఎలాగైతే చేశానో అదే విధముగా ఎల్లప్పుడూ సమితి ద్వారా నిర్వహించే సేవలకు వెన్నంటే ఉండి సమితి అభివృద్ధికి కృషి చేస్తామని తెలియజేసి, నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. నూతన అధ్యక్షులు కాచం కాశినాథ్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని నాకు నా తోటి మిత్రులకు అవకాశం కల్పించిన సమితి గౌరవ సర్వ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసి, సర్వ సభ్యుల సూచనలతో సమితి అభివృద్ధికి పాటుపడుతామని, అమర్నాథ్ అన్నదాన సేవా సమితి సేవలను విస్తృతపరిచే దిశగా అడుగులు వేస్తామని, త్వరలోనే మిగతా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకొని ఈ సంవత్సరం అమర్నాథ్ యాత్రికులకు అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమములో సమితి వ్యవస్థాపక గౌరవ సభ్యులు, సభ్యులు చీకోటీ మధుసూదన్, మాజీ మున్సిపల్ చైర్మెన్ కడవేర్గు రాజనర్సు, కోశాధికారి గోపిశెట్టి శరభయ్య, పీ ఆర్ ఓ డా. మాంకాల నవీన్ కుమార్, గౌరవ సభ్యులు అయిత రత్నాకర్, గుబ్బా లింగమూర్తి, గంప శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.